నిజానికి రెండు రూపాలుండవంటారు. అయితే, తనకపే లాభం లేనప్పుడు నిజం చెప్పడానికీ, తన కెంత నష్టం జరిగినా నిజం చెప్పడానికి యెంతో తేడా! అప్పుడు నిజం కూడా రెండు రూపాలతో వుంటుందనుకోవాలేమో!

"మళ్ళీ ఎందుకొచ్చినట్లు యితను?" ఇదే ప్రశ్న జానకి మనస్సులో ఎన్నిసార్లో వచ్చింది. కాని జవాబు మాత్రం దొరకలేదు. పోనీ సిగ్గువిడిచి ఎవరినైనా అడుగుదామా అంటే, అబ్బే అదీ లాభంలేదు.

ఎవరికి మాత్రం తెలుసు యితడొస్తాడని? అది తెలియకేగదా పది గంటల రైల్లో దిగబడ్డ యితనికి మళ్ళీ వంటచేసి వంటింటి పనులు తెమల్చుకునేసరికి ఒంటిగంటయింది.

ఏమిటీ విపరీతమైన ప్రవర్తన. బహుశా ఏ సంగతి ఒకమారు జాగర్తగా పరిశీలించి ఒక నిర్ణయం తీసుకోవడం తెలియదేమో. ఒకవేళ అదే తెలిసుంటే పెళ్ళిచూపులకనివచ్చి చూపులయేక సంతృప్తిగా వెళ్ళిపోయి పదిహేను రోజులవరకు ఏ సంగతీ తెలియజెయ్యక అందరినీ నిరాశలో ముంచి, హఠాత్తుగా ఒక రోజున వుత్తరంలో "మీ అమ్మాయి నాకు నచ్చినట్టే కాని కొన్ని అతి ముఖ్య విషయాలు మీతో మాట్లాడాలి. వీలుచూసుకొని, సాధ్యమైనంత త్వరలో ఈ వూరు వస్తారని ఆశిస్తాను." అని వ్రాసి నాన్నగారిని తక్షణం ప్రయాణం కట్టించేడు.

ఆవూరునుంచి తిరిగివచ్చిన నాన్నగారు గంభీరంగా వుండటంతో ఇహ ఈ సంబంధంకూడా పోయింది. ఇహ ఈ జన్మలో నాకు పెళ్ళి జరగదు అనుకుంది.

పెళ్ళికి అర్హత మంచి కులం, అందం కాదు. ఆరోజులు ఎపుడోపోయాయి. డబ్బు కావాలి. అది ఎంతో ముఖ్యం. ఎంత డబ్బువుంటే అంత మంచి వరుణ్ణి కొనుక్కోవచ్చు. తన స్నేహితురాలు కాలేజీ డిబేటులో కరతాళ ధ్వనుల మధ్య చెప్పిన పచ్చి నిజాలు జానకి మనస్సులో తళుక్కుమన్నాయి. ఆ తరువాత అమ్మకూడా ఎందుకో మొహం ఎండబెట్టుకుని కూచుంది. "ఎందుకమ్మా అంత విచారం. ఇప్పటివరకు పుసిగిపోయిన పది సంబంధాలు కట్నాలదగ్గరే కదమ్మా ఈ రోజులలో కావలసింది కళ్యాణ యోగం కాదమ్మా. ధనయోగం.... అదే యోగం మనకు పట్టిందంటే.... ఈ క్షణంలో నా పెళ్ళి అయిపోతుందమ్మా" ఏదో పెద్ద ఆరిందలా అమ్మకి ధైర్యం చెప్దామనుకుంది కాని, ఆ అవకాశం ఎవరిచ్చారు తనకు?

నాన్నగారు, అమ్మ ఏదో ఘర్షణ పడ్డారు. అమ్మ రెండు మూడుసార్లు కళ్ళు తుడుచుకుంది. వారి వాదన పూర్తిగా తనకి వినిపించలేదుగాని వినిపించిన మాటలు జోడించితే తన పెళ్ళి గురించేనని తెలిసింది. ఆడపిల్లను కన్న ప్రతి తల్లి దండ్రుల అవస్థా యిలాగే వుంటుంది కాబోలు!

ఏ సంగతీ యితమిద్ధంగా తెలియక తికమక పడుతున్న జానక్కి ఆ రోజు ఘర్షణ జరిగిన తర్వాత నుంచి అమ్మా నాన్నల మొహాలలో వచ్చిన మార్పు, వారి మొహాలలో గంభీరతతో కూడిన ప్రశాంతత- యింటినిండా మౌనం భరించలేనివిగా వున్నాయి. నాన్నగారు "అయితే రాసేమంటావుటే" అని అనడం "ఆ రాయండి యిప్పటికే ఆలస్యం అయింది. అదీగాక యివాళ మంచిరోజు కూడాను" అని అమ్మ అనడం. నాన్నగారు ఉత్తరం రాయడం ఒక్కమారు జానకి బుర్రలో మెదిలాయి.

ఆ కవరుమీది ఎడ్రసు చూసి ఎవరికో గ్రహించగలిగింది గాని ఆ ఉత్తరంలో నాన్నగారు, నీవడిగిన ప్రకారమే కట్నం ఇస్తామన్నారో లేక అంతకట్నం ఇచ్చుకోలేము అని బేరానికి దిగారో లేక వాయిదాల పద్ధతిలో యిస్తామన్నారో, అంతుచిక్కలేదు తనకి.

హు.... యిదే బాగుంది! ఈ మౌనం ఈ ఇంట్లో యిలాగే మరి రెండు నెలలు వుండుగాక అని శపించింది జానకి మనసులోనే. కామ్‌గా పరీక్షలు చదువుకోవచ్చును. ఇటు పెళ్ళికాక, అటు పరీక్ష పోతే యింకేముంది తన బ్రతుకు? అని అనుకొని ఇంగ్లీషు టెక్స్ట్ తీసుకొని కూర్చున్న జానక్కి పెళ్ళి సరంజామా మాటలు వినిపించాయి. అయితే పెళ్ళి అవుతుందన్నమాట తనకి. హు!

హఠాత్తుగా నారాయణరావు రూపు ఆమె మనసులో మెదిలింది. కథలలో వర్ణించినట్లు అట్టే పొడగరి కాడు. మామూలు పొడవు. బొద్దుగా వొళ్ళు. తెలుపు. నిర్మలమైన మొహం. హుషారుగా వుండే కళ్ళు. దానికితోడు ఠీవిగల నడక- ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. కానీ "అన్నీ వున్నాయి, ఐదోతనం లేదన్నట్లు" సిగ్గు, మొహమాటం కనిపించటంలేదు. అవేగాని వుంటే పెళ్ళి కాకుండా రెండుమార్లు కాబోయే అత్తవారింట్లో తిష్ఠ వేస్తాడా? రేపొద్దున పెళ్ళయితే ఎప్పుడూ యిక్కడే వుంటాడు కాబోలు. అలాగయితే అందరిలో చులకనై పోదూ, ఛీ! తనెంత సిగ్గులేనిదయిపోయింది. ఆలులేదు. చూలులేదు అన్నట్లు అయినా ఆలోచనలకైనా హద్దుండాలి.

* * *


ఆ సాయంత్రం ఎందుకోగాని బీచిలో ఎక్కువమంది లేరు. అక్కడ కూర్చున్నారు నారాయణరావు, జానకిలు. ఎంతసేపీ మౌనం. జానకి ఇబ్బందిగా కదిలింది. ఈ వ్యక్తిని అర్థం చేసుకోవటం చాలా కష్టం. మనసులోనే అనుకుంది.

కాఫీ టిఫిన్ కాగానే అమ్మా, నాన్నలను ఉద్దేశించి "మీ అమ్మాయితో కొంచెం మాట్లాడాలి. మీకభ్యంతరం లేకపోతే.... జానకిని నాకూడా అలా బజారువేపు తీసుకెళతాను" అని నారాయణరావు అనడం, అమ్మా, నాన్నలు ఒకరి మొహాలు ఒకరు చూసుకొని, "సరే నాయనా సాధ్యమైనంతవరకు వేగం వచ్చేయండి- అమ్మాయి పరీక్షలు దగ్గరవుతున్నాయి" అనడం జానకిని సంభ్రమాశ్చర్యాలలో ముంచింది. ఛీ! నీతో ఒంటరిగా రాను. అంతగా మాట్లాడాలని వుంటే ఇక్కడే మాట్లాడు. నేనేం బొమ్మననుకున్నావా? నాకు మాత్రం యిష్టా యిష్టాలు లేవా? గట్టిగా మగవారి నిరంకుశత్వంమీద పెద్ద లెక్చరిద్దామను


కున్న తను 'వెళ్ళిరామ్మా' అన్న మాటతో. రోజులెంత మారినా ఆడవారి బతుకులింతే. ఎప్పుడూ పరతంత్రమే. అని అనుకొని చెప్పులు వేసుకొని అతన్ని అనుసరించింది. అతను దారిలో "ఈ వూరు నాకు క్రొత్త. కాస్త బీచికి త్రోవ చూపండి." అన్న మాటతప్ప మరేమీ మాట్లాడలేదు. ఆ తర్వాత ఈ దుర్భరమౌనం. అప్పుడే తాము బీచికి వచ్చి పావుగంట అయింది. అతని దీర్ఘాలోచనా, ముఖభావాలు చూస్తుంటే ఏదో చెప్పాలని చెప్పలేక పోతున్నట్లు తెలుస్తూనే వుందిగాని ఎంత సేపా నిరీక్షణ.

"జానకీ! నాన్నగారు అన్ని విషయాలు చెప్పేరా?" "ఏ విషయాలో తనకి తెలి

# నిజం



మాలాప్రగడ బాలకేశవరావు



# నూతనాషాఢ మాసంలో

నూతనాషాఢ మాసంలో
మిన్నులో ఒక మబ్బు
మన్నులో ఒక చినుకు
రాల్చిపోయినది
రెక్కలార్చినది!

మరల మరలా మబ్బులెన్నో
నలుపు తెలుపుల పొగల
రెక్కలను చాపినవి
దిక్కులను నిండినవి!

జలదములు స్రవియించు అశ్రులు
కన్నుకన్నున కారుమెరుపులు
గళము గళమున భయద గర్జలు
మరల మేఘాల కన్నీళ్ళు

నింగి నేలలు నిండుకొన్నవి!

తరులు లలిత లతానికరములు
తనువు చినుకుల తడిసిపోవగ
తలలు వాల్చినవి
పులకరించినవి!

చెదరు చినుకులె వానజడియై
చిన్నికాల్వలు, పెద్దకాల్వలు

పరుగులెత్తినవి ప్రక్కలకు
నురుగులను క్రక్కినవి!

వాన వెలియుచె తడవుగా —
చెట్లకొమ్మల విహంగమ్ములు
చినుకులను విదిలించుకొని

నును రెక్కలార్చినవి
నింగికి ఎగసిపోయినవి!

మబ్బు లూరడిలినవి,
నింగిని
మాయమైపోయినవి
కాని ఒక తెలిమబ్బు మాత్రము
గగనసంద్రం మధ్య మందున
నావపోలిక
తేలసాగినది.

—ఎన్. మోహన్ కుమార్

ఫొటో : బి. నాగేశ్వరరావు

యవు. ఏమి జవాబు చెప్పాలో తెలియదు. నాన్నగారు నాకే విషయాలు చెప్పలేదండీ" అని నిర్మొహమాటంగా చెబుదామనుకొందిగాని. ఎందుచేతనో అప్రయత్నంగా "అ!" అన్న శబ్దం ఆమె నోటినుంచి వచ్చింది.

"అలా మీరు సిగ్గుతోనూ, మొహమాటంతోనూ ఆఁ, వూఁ అంటే చాలదండి. ఇది మన ఇద్దరి జీవిత సమస్య. నిర్మొహమాటంగా అన్ని విషయాలు అడిగి తెలుసుకొని ఆపైన ఏదైనా ఒక నిర్ణయానికి రావడం ధర్మం. పరిస్థితులు విపులంగా తెలుసుకొని అవసరముంటే సర్దుకోవడం మంచిదిగాని తెలుసుకోకుండా మోసపోయామని ఒకరిని తిట్టడం తెలివితక్కువతనం."

అతని మాటల్ని ఆపకుండా అలా అతని మొహంచూస్తూ కూర్చుంది జానకి.

"ఇంతకీ నేను వచ్చిన పనేమిటంటే.... మన వివాహానికీ మీ అంగీకారం తెలుసుకుందామనే. కాని ముక్కుసూటిగా మీరు నన్ను పెళ్ళిచేసుకుంటారా? అని అడిగే ముందు నా యోగ్యతలు, లోపాలు మీ ముందు విప్పి చెప్పడం సభ్యతే కాకుండా, మనిద్దరికి శ్రేయస్కరం. బహుశా నేను చెప్పబోయే సంగతులు మీరు మీ నాన్నగారి ద్వారా వినే వుంటారు. అయినా మరొకమారు మీ చెవినివేసి మీ నిర్ణయాన్ని తీసుకుందామనుకుంటున్నాను. మీ కేం అభ్యంతరమా?"

"ఏమిటి ఉపోద్ఘాతం. కొంపతీసి మాష్టరుగిరి చెయ్యడంలేదుగదా. ఇతని ధోరణి అంతా చూసి మంచి సంస్కారం గల వ్యక్తి అనుకోవడమా? లేక రంగంలోకి దిగేముందు పకడ్బందీగా వాడం బడిక చేసుకునే తెలివైన వ్యాపారస్తులనుకోవడమా?" జానకి మనసు గజిబిజిగా తయారైంది.

"చెప్పండి."

నా జీతం ఆరువందలు. ఇంటి అద్దె బాపతు మూడు వందలు వెరసి తొమ్మిది వందలు నెలసరిఆదాయం. మరీ జల్సాలకి సరిపోదేమోగాని మన కనీస అవసరాలకి సరిపోతుంది. నాకు సిగరెట్లు, సినిమాలు తప్ప మరే వ్యసనాలు లేవు. వీటన్నిటి మాటకేంగాని ముఖ్యంగా ఆలోచించవలసినవి ఏమిటంటే—రెండవ పెళ్ళివాణ్ని. దానికి తోడు యిద్దరు పిల్లలు—పెద్దవాడు నాలుగేళ్ళవాడు, చిన్నవాడు రమారమి రెండు సంవత్సరాలవాడు. అంచేత పెళ్ళవగానే గృహిణి బాధ్యతేకాక తల్లి బాధ్యత కూడా మిమీద పడుతుంది. అదీకాక

మరొక ఏమిటంటే.... నసుగుతూ మరి ఆ వాక్యం పూర్తిచేయలేకపోయేడు నారాయణరావు. తల వంచుకొని మౌనంగా వుండిపోయేడు.

"ఈ విషయాలన్నీ మా అమ్మ చెప్పిందండి" మౌనాన్ని భంగపరిచింది.

చురుగ్గా ఒక మారు తలెత్తి చూసి మళ్ళీ ఏమొచ్చిందోగానీ కళాహీనంగా తయారైన ముఖాన్ని జానకి కళ్ళ పడకుండా దాచుకున్నాడు. రెండు క్షణాలలా వుండి "ఆ సంగతి కూడా చెప్పేరా మీవాళ్ళు." బుర్ర వంచుకునే అడిగేడు.

"ఏ సంగతి" దీర్ఘం తీస్తూనే మరొక మారు తల్లి చెప్పిన మాటలను మననం చేసుకొని "లేదండి—మరేం చెప్పలేదు."

"ఆఁ"-షాక్ తిన్నట్టుగానారాయణరావు అదిరిపడి పాలిపోయిన మొహంతో "అసలు సంగతి చెప్పనేలేదన్నమాట." తనలోతనే అనుకొన్నాడుగాని జానకి వినునే వింది.

వుండబట్టలేక జానకి-"పోనీ మీరు చెప్పండి మాఅమ్మ మర్చిపోయివుంటుంది" తల్లిని వెనకవేసుకొని మాట్లాడింది అతనిముందు చులకనైపోకుండా.

చెప్పవలసిందేదో సూటిగా చెప్పలేక కొంతసేపు ఆలోచించి యిలా చెప్పడం మొదలుపెట్టాడు నారాయణరావు :

"లక్ష్మి కాన్పులన్నీ కత్తులతోనే అయ్యాయి. ఆమె ఎలా అనుభవించిందోగానీ నేను మాత్రం ఆ బాధ చూసి భరించలేకపోయాను. ఎలాగా మేమిద్దరం అనుకున్నట్లు యిద్దరబ్బాయిల తర్వాత ఒక అమ్మాయి పుట్టనే పుట్టింది. ఇంకా లక్ష్మిని బాధించడం భావ్యం కాదని నేను మరి పిల్లలు కలగకుండా అపరేషన్ చేయించుకున్నాను." మొహాన్ని పట్టిన చెమట తుడుచుకున్నాడు.

జానకి అవాక్కయి చూస్తున్నది.

"విధి నన్ను చిన్నచూపు చూసింది. లక్ష్మిని, ఆ పసిగుడ్డుని నాకు కాకుండా తీసుకుపోయింది దుఃఖాన్నిమింగి తల్లిని, తండ్రిని ఆ పిల్లలకు నేనే అయి పెంచుకుందామనుకున్నాను. కాని నా ఆశయం నెరవేరలేదు. ఆ పసిపిల్లలకు తల్లిని కాలేకపోయాను. ఆ లోటు అలా వదిలేస్తే పిల్లల భవిష్యత్తు అంధకార మౌతుందని మళ్ళీ పెళ్ళి చేసుకుందామనే నిర్ణయానికివచ్చాను. నా పరిస్థితి అంతా ఇప్పటికి మీకు అర్థం అయుంటుందనుకుంటాను. ఇక ఏ సంగతి ఆలోచించుకొని చెప్పడం మీ వంతు. ఒప్పుకుంటే సంతోషిస్తాను. మీ జీవితమంతా పువ్వులబాటలా నడవగలిగే శక్తిని యిమ్మని ఆ దేవుని ప్రార్థిస్తాను. కాదంటే నా కుటుంబం కోసం ఒక అబల జీవితం బలి కాలేదని తృప్తిపడతాను" అతని గొంతు జీరబోయింది.

కొంతసేపు దీర్ఘంగా ఆలోచించి జానకి "నా కిష్టమే" అంది.

నారాయణరావు మనసులో ఆనందం వెల్లువలై పారింది. కాని తన సంతోషాన్ని బైటకు వ్యక్తం చేయకుండా "నా కథ విని నామీద జాలిపడ్డారా? లేక త్యాగం చేస్తున్నారా? లేక మీ ఆర్థిక పరిస్థితికి ఒక మంచి వరుణ్ణి తెచ్చే శక్తిలేకా?"

మధ్యలోనే అందుకున్నజానకి "అవేమీ కావు- మీమీద ఈ స్వల్ప వ్యవధిలో ఏర్పడిన ప్రేమా, గౌరవాలచేత. నిజం చెప్పాలంటే నా ప్రేమ మీ అందాన్నిచూసికాదు. మీ ఆస్తిని చూసికాదు. మీ నిజాయితీని చూసి. ఎక్కడ నేను ఈపెళ్ళికియిష్టపడనో అని మా అమ్మా, నాన్నలు నానుంచి దాచిన రహస్యం మీరు దాచి, నన్నేకాదు, మా యింటి వాళ్ళందరిని సులువుగా మోసం చెయ్యగలిగి వుందురు. కాని అలా చెయ్యనియ్యలేదు మీ నిజాయితీ. అలాంటి మోసమే చేసుంటే మీ యోగ్యతలకు మంచి కట్నం కూడా వచ్చేదే. ఇంత మంచి మనస్సు వున్న మనిషితో జీవితాంతం గడిపే అదృష్టం అక్కయ్య ఎలాగూ పోగొట్టుకుంది. కనీసం నేనామె స్థానం వాంఛించడం స్వార్థమనుకుంటాను నేను. త్యాగం మాత్రం కాదు" అంది.

## అమరక్షణం

చిత్రకారుడు మహ చిత్రమైనవాడు
సంజ రంగులు సృష్టిస్తాడు
చల్లగాలులు రప్పిస్తాడు.
వెన్నెలనీ పొన్నలనీ, చిన్న కాన్వాస్
మీద చూపిస్తాడు

రాధా మాధవుల్ని రమ్మని పిలిచి
మోహపరవశులై మేనులు మరచి
మైకంలో వాళ్ల ముద్దులాడ
బోతూండగా
ఆపేస్తాడు.

కోరికని పెదవుల్లో బంధించి
కాంక్షని కన్నుల్లో మెరిపించి
అద్భుత క్షణాన్ని అమరం చేస్తాడు.

సంజ రంగులు మారవు
చల్లగాలులు ఆగవు.
చిగురాకుల్లో మెరిసే చంద్రికలు
చిలిపి వూసుల్ని చెవొగ్గి వింటూనే
ఉంటాయి.
యమున నిశ్శబ్దంగా ప్రవహిస్తూనే
ఉంటుంది.

—కె గోదావరిశర్మ

మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకా పెన్స్
& బాల్ పెన్స్
REGD. No. 143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారుచేయబడుచున్నవి.
అశోకాపెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)

మీరూ కుట్టుపని నేర్వండి

వేలాదిమందికి నేర్పితిని. నా పుస్తకాల ద్వారా అనేకులు నేర్చిరి. లాల్చీ, షర్టు, జాకెట్, ప్యాంట్లుతో 30 రకములు కత్తిరించి కుట్టేది 384 పే. 400 బొ. రు. 20/- కత్తిరింపులలో 160 ప్లాన్లు రు 20/- ఈ 2 తెలుగు వి. పి తో 45/- ఆర్డరుతో అడ్వాన్సు రు. 5/- పంపాలి. జి. పున్నారావు చౌదరి, మోపర్రు, తెనాలి తాలూకా.

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలనైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
GAUTAM CHIKITSALAYA (S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)